
ప్రజాశక్తి
గురువారం 30 మార్చి 2023
5
పార్వతీపురం మన్యం



## అక్రమ డెప్యుటేషన్ రద్దుపై యుటిఎఫ్ హర్షం

ప్రజాశక్తి- పార్వతీపురంరూరల్

జమదాల ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయులు బి.జగన్నాథాన్ని ఎంఇఒ వరప్రసాద్ పాచిపెంట మండలానికి నిబంధనలకు వ్యతిరేకంగా డెప్యుటేషన్‌పై పంపడాన్ని డిఇఒ రద్దు చేయడంపై యుటిఎఫ్ ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేసింది. ఈ మేరకు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు టి.రమేష్, ఎస్.మురళీ మోహనరావు ఒక ప్రకటన విడుదల చేశారు. మండలం నుండి వేరే మండలానికి డెప్యుటేషన్ వేయాలంటే జిల్లా విద్యాశాఖ అధికారి అనుమతి అవసరమని, అలా అనుమతి తీసుకోకుండానే పార్వతీపురం ఎంఇఒ డెప్యుటేషన్ వేశారని తెలిపారు. ఇది నిబంధనలకు విరుద్ధమని, ఈ విషయమై డిఇఒ దృష్టికి తీసుకెళ్లామని చెప్పారు. దీంతో జగన్నాథం డెప్యుటేషన్ రద్దు చేయడమే కాకుండా, నిబంధనలకు విరుద్ధంగా ప్రవర్తించిన ఎంఇఒపై చర్యలకు ఆదేశించడం సంతోషించదగ్గ విషయమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా డిఇఒకు కృతజ్ఞతలు తెలిపారు. ఎంఇఒ అనుచిత ప్రవర్తన వల్ల మండలంలో గిరిజన మహిళా ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారని, వారి సమస్యను కూడా పరిష్కరించాలని కోరారు.

జియ్యమ్మవలస మండలం బాసంగిలో నేలకొరిగిన అరటి



33 శాతం నష్టం జరిగితేనే పరిహారం

నివేదిక పంపాలని ప్రభుత్వ ఆదేశం

# 4,550 ఎకరాల్లో పంటనష్టం

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

ఈనెల 17 నుంచి 28వ తేదీ వరకు విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో కురిసిన వర్షాలు, పెనుగాలులకు వ్యవసాయ, ఉద్యాన పంటల్లో తీవ్ర నష్టం జరిగింది. దీంతో రైతులు దిగులు చెందుతున్నారు. పంట నష్టాలపై ప్రభుత్వ శాఖల అంచనా కొలిక్కి వచ్చింది. ఈ వివరాలను వెంటనే ప్రత్యేక పోర్టర్‌లో నమోదు చేసి పంపాలని ప్రభుత్వం ఆదేశించింది. రెండు జిల్లాల్లో కలిపి 4550 ఎకరాల్లో పంట నష్టంజరిగినట్లు అంచనా. విజయనగరం జిల్లాలో 13 మండలాల పరిధిలోని 91 గ్రామాల్లో 3,400 ఎకరాల్లో మొక్కజొన్న నేలకొరిగింది. ముఖ్యంగా చేతికి అందాల్సిన దశలో మొక్కజొన్న కంకులు పెనుగాలకు నేలమట్టమయ్యాయి. దీనికి సంబంధించి లెక్కలు 90శాతం పూర్తయ్యాయి. మిగిలిన 10శాతం గణన పూర్తికాగానే ప్రభుత్వానికి నివేదిక పంపుతామని వ్యవసాయ శాఖ అధికారులు, జిల్లా జాయింట్ కలెక్టర్ ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. మరోవైపు జామి, దత్తిరాజేరు, రామభద్రపురం,పూసపాటిరేగ, నెల్లిమర్ల తదితర 10 మండలాల్లో సుమారు 150ఎకరాల్లో అరటి, కూరగాయల పంటలు దెబ్బతిన్నట్టు తేలింది. అక్కడక్కడ బొప్పాయి తోటలు కూడా దెబ్బతిన్నాయి. తుదిజాబితా మరో రెండు మూడు రోజుల్లో ఖరారు అవుతుందని ఉద్యాన శాఖ డిప్యూటీ డైరెక్టర్ తెలిపారు. అటు పార్వతీపురం మన్యం జిల్లాలో సుమారు వెయ్యి ఎకరాల్లో పంటనష్టం వాటిల్లినట్లు అంచనా. అందులో అరటి పంట సుమారు 100 ఎకరాల్లో దెబ్బతింది. గరుగుబిల్లి, వీరఘట్టం, సాలూరు, పాచిపెంట, మక్కువ, కురుపాం, జియ్యమ్మవలస తదితర మండలాల్లో ఎక్కువగా నష్టం జరిగింది. పాచిపెంట, సాలూరు తదితర మండలాల్లో సుమారు 900 ఎకరాల్లో మొక్కజొన్నకు నష్టం వాటిల్లింది. ఈనెల ఆఖరులోగా స్పష్టమైన లెక్కలతో జిల్లా అధికారులు ప్రభుత్వానికి నివేదించనున్నారు. నష్టపరిహారం చెల్లింపులపై కూడా ప్రభుత్వం స్పష్టమైన మార్గదర్శకాలను స్పష్టం చేసింది. ప్రతి రైతుకూ పంటల వారీగా సాధారణ ఉత్పత్తిలో 33శాతం నష్టం వాటిల్లిన వారికి ప్రభుత్వం నుంచి ఆర్థిక సాయం అందుతుంది. దీనికితోడు ఆయా పంటలు ఇప్పటికే ఇ-క్రాప్‌లో నమోదై ఉండాలని మెలిక కూడా ఉంది.

# ఆర్జిత సెలవుల డబ్బులేవి?

- టిఎ, డిఎల కోసమూ ఎదురు చూపే!
- సగటు ఉద్యోగుల్లో నిరాశ



***ప్రభుత్వ ఉద్యోగం అంటే బతుకుదెరువుపై ధీమా? మెరుగైన వేతనాలు, అవి కూడా నిర్ధిష్టమైన కాలపరిమితిలో అందుతాయనే భరోసా.. పనిలో మరింత ఉత్సాహం నింపే విధంగా టిఎ, డిఎలు, అదనపు ప్రోత్సాహకాలు ఎంతో దోహదపడతాయి. సర్వీసు మధ్యలోనే ఇల్లో, పెళ్లో అనుకుంటే జిపిఎఫ్ రూపంలో దాచుకున్న సొమ్ము తీసుకోవచ్చనే భావన. ప్రభుత్వ అవసరాల నిమిత్తం ఎర్నడ్ లీవ్స్ ఉపయోగించుకోకపోవడం సాధ్యం కాకపోయినా సరెండర్ లీవ్ పేరిట ఆయా రోజులకు సంబంధించిన వేతనం కూడా వచ్చేస్తుంది. ఇదీ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగికి, ప్రైవేటు కొలువులకు మధ్య ఉన్న తేడా. కానీ, ఇదంతా ఒకప్పటి మాట. ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు. ఒకటో తేదీ నాటికి ఖాతాల్లో జీతాలు పడతాయనే ధీమా లేదు. టిఎ, డిఎలు ఏళ్ల తరబడి పెండింగ్. ఇక ప్రోత్సాహకాలు ఆశించడం అత్యాసే అవుతుంది. జిపిఎఫ్ మాత్రం ఎట్టకేలకు విడుదల చేయడంతో దాని కోసం దరఖాస్తు చేసుకున్న కొంతమంది ఉద్యోగులు ఊపిరి పీల్చుకుంటున్నారు.***

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

జిల్లా వ్యాప్తంగా సుమారు 22,821 మంది రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఉన్నారు. గతంలో ప్రతి నెలా 1 లేదా 2, 3 తేదీల్లోపు జీతాలు అందేవి. ప్రస్తుతం ఆయా తేదీల్లో జీతాలు తమ బ్యాంకు ఖాతాల్లో జమ కావడం లేదని, ఒక్కోసారి 10వ తేదీ వరకు అందడం లేదని ఎక్కువ శాఖల ఉద్యోగులు, అధికారులు ఆవేదన. పోలీస్, వైద్యారోగ్యం, విద్యుత్ వంటి అత్యవసర విభాగాలు శాఖలకు ప్రాధాన్యతా క్రమంలో వేతనాలు వేస్తున్నట్టు పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. గడిచిన రెండేళ్లగా ఇదే పరిస్థితి ఉండడంతో ఉద్యోగులు కూడా చాలా వరకు అలవాటు పడ్డారు. సరెండర్ లీవ్‌లకు రావాల్సిన డబ్బులు రాకపోవడాన్ని ఉద్యోగులు, అధికారులు జీర్ణించుకోలేకపోతున్నారు. ప్రతి ఉద్యోగికీ వారంతపు సెలవులు, ప్రత్యేక సెలవులు, మెడికల్ లీవ్స్, ప్రసూతి సెలవులతో నిమిత్తం లేకుండా ఏడాదికి 30 ఎర్నల్ లీవ్స్ ఉంటాయి. ఈ లెక్కన 30ఏళ్ల సర్వీసుగల ఉద్యోగికి ఏడాదికి 15చొప్పున 490సెలవులు ఆదా అవుతాయి. వీటికి సంబంధించిన ఎన్‌క్యాష్‌మెంట్ ఉద్యోగ విరమణ సమయంలో విడుదల చేస్తారు. కానీ, నెల నెలా మిగిలిపోయిన సెలవులకు ఎప్పటికప్పుడు ఉద్యోగులు దరఖాస్తు చేసుకుంటే చెల్లింపులు చేయాల్సివుంది. కానీ, రెండేళ్లగా వీటికి సంబంధించిన నగదు విడుదల చేయలేదని ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు లేదా సీనియర్ ఎంప్లాయిస్‌కు ఈ రూపంలో రావాల్సిన మొత్తం రూ.లక్షల్లోనే ఉంటుంది. ఎర్నడ్ లీవ్‌లకు సంబంధించి దరఖాస్తు చేసుకున్న ఉద్యోగుల నుంచి ఆదాయ పన్ను సైతం ప్రభుత్వం వసూలు చేసింది. కానీ ఇంతవరకు ఆ డబ్బులు చెల్లించకపోవడంతో ఉద్యోగులు, ఉపాధ్యాయులు తీవ్ర ఆవేదన చెందుతున్నారు.

మరోవైపు డిఎల ప్రస్తావన కూడా ప్రభుత్వం నుంచి కనిపించడం లేదు. సాధారణంగా కేంద్ర ప్రభుత్వం డిఎ ప్రకటించినప్పుడల్లా రాష్ట్ర ప్రభుత్వం కూడా డిఎ పెంచడం మన రాష్ట్రంలో కొన్నాళ్లగా అనవాయితీగా సాగుతోంది. ఈలెక్కన ఇప్పటి వరకు నాలుగు దఫాలుగా పెంచలేదని ఉద్యోగులు ఆవేదన చెందుతున్నారు. ఒక సందర్భంలో డిఎ సొమ్ము ఖాతాల్లో వేసినట్టే వేసి, కొన్ని గంటల్లో వెనక్కి తీసుకున్నారని కూడా కొంతమంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉద్యోగి లేదా అధికారి తమ శాఖాపరమైన పనిపై ఎక్కడికైనా వెళ్లినప్పుడు అందుకు అవసరమైన ప్రయాణం, భోజనం ఇతరత్రా ఖర్చుల నిమిత్తం కొంత బడ్జెట్ ఉండేదని, ఇప్పుడు అటువంటి పరిస్థితి దాదాపు కనిపించడం లేదని ఉద్యోగుల నుంచి అధికారుల వరకు చెబుతున్నారు. చివరకు వాహనాల అద్దెలు, పెట్రోల్ ఖర్చులు కూడా ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్నాయని చెబుతున్నారు. తమ సర్వీసులో ఎన్నడూ ఇటువంటి పరిస్థితులు చూడలేని ఉద్యోగులు వాపోతున్నారు. ఉన్న బడ్జెట్‌ను అటు ఇటు సర్ధుబాటు చేసి ప్రజల మొప్పు పొందాలన్న ఆశ, యావ తప్ప, సంపదను సృష్టించే ఉద్యోగుల వేతనాలకు, సంక్షేమ పథకాలకు సకాలంలో ఆర్థిక ప్రయోజనాలు కల్పించగలమన్న ఆలోచన లేదని ప్రజా, ఉద్యోగ, కార్మిక సంఘాల నాయకులు వ్యాఖ్యానిస్తున్నారు.

# గంటేడకు పతంజలి పురస్కారం

**గర్వించదగ్గ గొప్ప రచయిత పతంజలి : గౌరునాయుడు**

ప్రజాశక్తి-విజయనగరం కోట

ప్రపంచం గర్వించదగ్గ గొప్ప రచయిత, పాత్రికేయుడు, సినీ మాటల రచయిత కెఎన్‌వై పతంజలి పేర ప్రతి ఏటా అందించే సాహితీ పురస్కారం ఈ ఏడాది ప్రఖ్యాత కథకులు, కవి, గేయ రచయిత గంటేడ గౌరునాయుడుకు దక్కింది. కెఎన్‌వై పతంజలి సాంస్కృతిక వేదిక ఆధ్వర్యాన బుధవారం గురజాడ పబ్లిక్ స్కూలులో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గౌరునాయుడుకు ఈ పురస్కారాన్ని నిర్వాహకులు అందజేశారు. ముందుగా పతంజలి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం గౌరునాయుడు మాట్లాడుతూ పతంజలి పురస్కారం తనకు రావడం ఆనందంగా ఉందన్నారు. పతంజలి రచనలకు విజయనగరం జిల్లా కేంద్ర బిందువుగా ఉండేదని, తన రచనా ప్రవాహం, మాటల తూటాలతో వ్యవస్థలో కుళ్లును కడిగే ప్రయత్నం చేశారని తెలిపారు. తెలుగు సాహిత్య చరిత్రలో పతంజలి ఎవరికన్నా తక్కువ కాదని, ప్రతి రచయితకు విమర్శకులు ఉండేవారని, ఒక్క పతంజలికి మాత్రమే గొప్ప స్నేహితులు ఉండేవారని అన్నారు. నేటి తరం విద్యార్థులు పతంజలి రచనలు చదివితే మంచి భవిష్యత్తు ఉంటుందని అన్నారు. మరో రచయిత అట్టాడ అప్పలనాయుడు మాట్లాడుతూ గురజాడ గిరీశంను సృష్టిస్తే పతంజలి గోపాత్రుడ్ని సృష్టించి విభిన్న తరహాలో ప్రజల ముందుకు తెచ్చారని కొనియాడారు. ప్రజల భాష, గుండె ఘోష తెలిసిన రచయిత కాబట్టే అందరి మన్ననలు పొందారని, రచనలో చమత్కారం పతంజలి కథకి ఆయువు పట్టుగా ఉండేదని అన్నారు. వేదిక అధ్యక్షుడు భీశెట్టి బాబ్జి అధ్యక్షత వహించిన ఈ సభలో కథా రచయిత మల్లిపురం జగదీష్, పతంజలి సతీమణి ప్రమీలా, అల్లుడు రామకృష్ణరాజు, డాక్టర్ మోహన్, వేదిక కార్యదర్శి ఎన్.కె.బాబు, విఎమ్‌కె లక్ష్మణరావు, సీనియర్ పాత్రికేయుడు ఎలిశెట్టి సురేష్, హోటల్ మయూరి అధినేత బాబూరావు, సాహితీ స్రవంతి రాష్ట్ర కార్యదర్శి చీకటి దివాకర్, కందాల సాయిబాబా, గురజాడ ఇందిరా, చీకటి చంద్రిక, కాంచన, దవడ కొండబాబు, కె. శ్రీనివాసరావు, గిడుతూరి పైడితల్లి, ఇప్పలవలస గోపీ, రామచంద్ర రాజు, గాయకుడు డప్పుశ్రీను, జక్కు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



గంటేడ గౌరునాయుడును సన్మానిస్తున్న నిర్వాహకులు

### గంటేడకు ప్రెస్ అకాడమీ మాజీ చైర్మన్ అభినందన

ప్రముఖ కథా రచయిత, కవి, నిత్య సాహిత్య కృషీవలుడు గంటేడ గౌరు నాయుడుకు 'పతంజలి సాహిత్య పురస్కారం' రావడం పట్ల ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రెస్ అకాడమీ మాజీ చైర్మన్ అదపాక సత్యారావు అభినందనలు తెలిపారు. గౌరునాయుడు మాస్టారు రైతులు, రైతు కూలీలు, గ్రామీణ ప్రాంత సకల వృత్తుల వారి కష్ట నష్టాలు, దయనీయ స్థితిగతులు తన రచనల ద్వారా సమాజం దృష్టికి నిరంతరం తీసుకువస్తూ, సాహిత్య వ్యవసాయాన్ని పండిస్తున్నారని సత్యా రావు ఒక ప్రకటనలో ప్రశంసించారు. గౌరునాయుడు మరిన్ని పురస్కారాలు, సత్కారాలు పొందాలని ఆయన ఆకాంక్షించారు

## 3న పింఛన్లు పంపిణీ

ప్రజాశక్తి-కలెక్టరేట్

ఏప్రిల్ నెలకు సంబంధించి పింఛన్లను కొన్ని అనివార్య కారణాల వల్ల మూడో తేదీ నుంచి పంపిణీ చేయనున్నట్లు డిఆర్‌డిఎ పీడీ పి.కిరణ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఏప్రిల్ 1, 2 తేదీలు బ్యాంకులకు సెలవు దినాలు కారణంగా 3న పింఛన్లు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. పింఛను లబ్ధిదారులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని ఆయన కోరారు.

## కెజిబివి పిలుస్తోంది

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

2023- 24 విద్యా సంవత్సరానికి గాను గుమ్మలక్ష్మీపురం కెజిబివిలో ప్రవేశాలకు విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎస్‌ఒ శ్రీరంజని ఒక ప్రకటనలో తెలిపారు. ఆరో తరగతి-40, ఎనిమిదో తరగతి- 2, తొమ్మిదో తరగతి-2 సీట్లు, ఇంటర్ ప్రథమ సంవత్సరం హెచ్ఇసి గ్రూప్‌లో 40 సీట్లు ఖాళీగా ఉన్నాయని చెప్పారు. https://apkgbv.apctss.in వెబ్‌సైట్‌లో దరఖాస్తులు చేసుకోవాల్సిందిగా కోరారు. పూర్తి వివరాల కోసం 7901098513, 89196 35046 నంబర్లను సంప్రదించాలని కోరారు.

## అంగన్వాడీ కేంద్రాల పరిశీలన

ప్రజాశక్తి-పాలకొండ

మండలంలో ఎల్ఎల్‌పురం, వాటపాగు అంగన్వాడీ కేంద్రాలను సబ్ కలెక్టర్ నూరుల్ కమర్ బుధవారం పరిశీలించారు. చిన్నారులకు అందించే పోషకాహారంతో పాటు రికార్డులు పరిశీలించారు. ఆయనతోపాటు తహశీల్దార్ పి.సోమేశ్వరరావు ఉన్నారు.

# పకడ్బందీగా టెన్త్ పరీక్షలు

ప్రజాశక్తి-కలెక్టరేట్

పదో తరగతి పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ.. అధికారులను ఆదేశించారు. పదో తరగతి పరీక్షల నిర్వహణపై విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాశ్‌తో కలిసి మంత్రి బొత్స.. జిల్లా కలెక్టర్లతో బుధవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ ఏప్రిల్ మూడో తేదీ నుండి 18వ తేదీ వరకు పదో తరగతి పరీక్షలు జరుగుతాయన్నారు. ప్రతిరోజూ ఉదయం 9.30 నుండి మధ్యాహ్నం 12.45 గంటల వరకు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పదో తరగతి పరీక్షలకు ప్రాముఖ్యత ఉందని, అత్యంత పకడ్బందీగా నిర్వహించాలని చెప్పారు. పరీక్షలు రాసే విద్యార్థులకు ఆర్‌టిసిలో ఉచిత ప్రయాణం ఏర్పాటు చేశామన్నారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

అనంతరం కలెక్టర్ నిశాంత్ కుమార్ జిల్లాలో పదో తరగతి పరీక్షలపై సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. కేంద్రాలలో అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. జిల్లాలో 64 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామని, 210 పాఠశాలల నుంచి 10,784 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారని వివరించారు. పరీక్షా కేంద్రాలకు కిలో మీటర్ దూరం పరిధిలో జిరాక్స్ దుకాణాలు మూసివేయాలని ఆదేశించారు. పరీక్షా కేంద్రాల వద్ద వైద్య శిబిరాలను ఏర్పాటు చేయాలన్నారు. బందో బస్తు ఏర్పాటు చేయాలని పోలీస్ శాఖను ఆదేశించారు.

ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో డిఇఒ ఎస్.డి.వి.రమణ, డిఎస్‌పి ఎ.సుభాష్, డిఎంహెచ్ఒ బగాది జగన్నాథరావు, డిటిసి సి.మల్లికార్జునరెడ్డి, డిపిటిఒ టి.వి.ఎస్.సుధాకర్, డిప్యూటీ డిఇఒ పి.బ్రహ్మాజీరావు, పోస్టల్ శాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.




వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన కలెక్టర్, డిఇఒ

## ఆర్థికాభివృద్ధి చెందాలి

ప్రజాశక్తి-వీరఘట్టం

మహిళలు ప్రతిఒక్కరూ ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఎమ్మెల్యే వి.కళావతి సూచించారు. ఈ మేరకు బుధవారం మండల కేంద్రంలో కూరగాయల విత్తనాలను పంపిణీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మండలంలోని 300 ఎకరాల విస్తీర్ణంలో కూరగాయలు సాగు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రైతు ఉత్పత్తిదారుల సంఘం సిఇఒ ఆనందరావు, అధ్యక్షులు జి.బలరాం, సభ్యులు ధర్మారావు, మహిళలు పాల్గొన్నారు.

## కిశోర్‌ను కలిసిన ఆశావహులు

ప్రజాశక్తి - కురుపాం

కేంద్ర మాజీ మంత్రి కిశోర్ చంద్రదేవ్‌ను బుధవారం కోట వద్ద టిడిపి ఎమ్మెల్యే టికెట్ ఆశావహుల గ్రూపు మర్యాద పూర్వకంగా కలిసింది. ఈ సందర్భంగా ఆయన గ్రామస్థాయిలో పార్టీ స్థితిగతుల గూర్చి ఆరాతీశారు. పార్టీ గెలుపునకు ప్రతి కార్యకర్త శక్తివంచన లేకుండా కృషి చేయాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ మాజీ సంస్థ చైర్మన్ దత్తి లక్ష్మణరావు, టిడిపి సీనియర్ నాయకులు ద్వారపురెడ్డి సత్యనారాయణ, పువ్వల లావణ్య, బిడ్డిక పద్మావతి, బిడ్డిక తమ్మయ్య, మాజీ ఎంపిపి జి.వి.రమణమూర్తి, టిడిపి యువ నాయకులు చందక రామకృష్ణ పాల్గొన్నారు.

## మెరిట్ ఆధారంగా పోస్టులు భర్తీచేయాలి

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

ఐటిడిఎ పరిధిలోని గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలల్లో, కళాశాలల్లో భర్తీ చేయనున్న 20 ఉపాధ్యాయ, అధ్యాపక పోస్టులను డెమో, ఇంటర్వ్యూ లేకుండా మార్కుల మెరిట్ ఆధారంగా భర్తీ చేయాలని గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర కార్యదర్శి పాలక రంజిత్ కుమార్ కోరారు. ఈ విషయమై ఐటిడిఎ పిఒకు వినతిపత్రం అందజేసినట్లు చెప్పారు.

## వివాదాస్పద స్థలం వద్ద హెచ్చరిక బోర్డు

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

గుమ్మలక్ష్మీపురంలో యూనియన్ బ్యాంకు వెనుక ఉన్న సర్వే నెంబరు 20/3ఎ 1.09 ఎకరాల స్థలం కోర్టులో పెండింగ్‌లో ఉందని, ఎవరైనా ఆక్రమిస్తే శిక్షార్హులు అవుతారని తహశీల్దార్ రాములమ్మ, విఆర్ఒ బోడమ్మ తెలిపారు. ఈ మేరకు బుధవారం వివాదాస్పద స్థలం వద్ద హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. ఆ భూమిపై కోర్టు కేసు ఉన్నందున ఇరుగ్రూపుల వారు భూమి వద్దకు వెళ్లకూడదని హెచ్చరించారు.

# మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యం

## వైఎస్ఆర్ ఆసరా చెక్కుల పంపిణీలో డిప్యూటీ సిఎం రాజన్నదొర



సాలూరురూరల్.. చెక్కు అందజేస్తున్న డిప్యూటీ సిఎం రాజన్నదొర

ప్రజాశక్తి-సాలూరు, రూరల్

మహిళల ఆర్థికాభివృద్ధితోనే కుటుంబం బాగుంటుందని, అదే లక్ష్యంతో సంక్షేమ పథకాలను ప్రభుత్వం అమలు చేస్తోందని డిప్యూటీ సిఎం పి.రాజన్నదొర తెలిపారు. బుధవారం మండలంలోని మామిడిపల్లిలో సర్పంచ్ సువ్వాడ శశికళ అధ్యక్షతన వైఎస్ఆర్ ఆసరా మూడో విడత నిధుల చెక్కును ఆయన లబ్ధిదారులకు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎన్నికలలో ఇచ్చిన మాట ప్రకారం మహిళా సంఘాలకు రుణ మాఫీ అమలు చేస్తున్నామని తెలిపారు. రాబోయే ఎన్నికల్లో సిఎం జగన్మోహన్‌రెడ్డికి ఓటు వేయడం ద్వారా రుణం తీర్చుకోవాలని కోరారు. మండలంలో 1073 మహిళా సంఘాలలోని 10,723 మంది మహిళలకు 4.58 కోట్ల రూపాయలను ఆసరా ద్వారా అందించినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షులు రెడ్డి పద్మావతి, ఎఎంసి చైర్‌పర్సన్ దండి అనంతకుమారి, ఎంపిపి జి.రాములమ్మ, వైస్ ఎంపిపిలు రెడ్డి సురేష్, సువ్వాడ గుణవతి, ఎపిఎం గండిపల్లి సింహాచలం, ఎంపిడిఒ గొల్లపల్లి పార్వతి, వైసిపి నాయకులు దండి శ్రీనివాసరావు, సువ్వాడ శ్రీనివాస్, కల్లేపల్లి త్రినాథ్, గణేష్ పాల్గొన్నారు.


**సచివాలయం, ఆర్‌బికె ప్రారంభం**

మండలంలోని కొత్తవలస గ్రామం నిర్మించిన గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రాలను డిప్యూటీ సిఎం రాజన్నదొర ప్రారంభించారు. సర్పంచ్ నెమలిపిట్ట ధర్మావతి ఆధ్వర్యాన నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఆయన నూతన భవనాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో స్థానిక సంస్థల బలోపేతానికి సచివాలయ వ్యవస్థ దోహదపడుతుందన్నారు. అనంతరం గ్రామంలో ఇంటింటికీ తిరిగి సంక్షేమ పథకాల లబ్ధి గురించి వివరించారు. రానున్న ఎన్నికల్లో వైసిపిని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి రెడ్డి సురేష్, సువ్వాడ గుణవతి, సీనియర్ నాయకులు దండి శ్రీనివాసరావు, సువ్వాడ రామకృష్ణ, ఎస్.జయసింహ, ఎఎంసి చైర్‌పర్సన్ దండి అనంతకుమారి పాల్గొన్నారు.

**బలిజిపేట :** వైసిపి అధికారంలోకి వచ్చాక 45 నెలల్లో నవరత్నాలు, సంక్షేమ పథకాలు, కార్యక్రమాల ద్వారా ఇంతవరకూ మండలానికి సుమారు రూ.268 కోట్లు కేటాయించినట్లు ఎమ్మెల్యే అలజంగి జోగారావు తెలిపారు. వెంగాపురంలో బుధవారం వైఎస్ఆర్ ఆసరా చెక్కులను నియోజకవర్గ పరిశీలకులు శోభా హైమావతితో కలిసి మహిళా సంఘాల సభ్యులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించడానికి వైఎస్ఆర్ ఆసరా పథకం మహోన్నతమైనదన్నారు. మూడు విడతలలో 1314 మహిళా సంఘాల్లో ఉన్న 14750 మంది మహిళలకు రూ.22.81 కోట్లు అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో డిఆర్‌డిఎ పీడీ పి.కిరణ్ కుమార్, ఎంపిపి గుడివాడ నాగమణి, జెడ్‌పిటిసి అలజంగి రవికుమార్, వైసిపి మండల అధ్యక్షులు పాలవలస మురళి, సర్పంచులు జి.అమ్మడమ్మ, మురళి, బండారు రాగలత, వైస్ ఎంపిపి వి.సాయిరాం పాల్గొన్నారు.

**గుమ్మలక్ష్మీపురం :** మహిళల సంక్షేమం, ఆర్థిక అభివృద్ధే ధ్యేయంగా సిఎం జగన్ పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే పాముల పుష్ప శ్రీవాణి అన్నారు. గుమ్మలక్ష్మీపురంలోని బిఎస్ఆర్ కళ్యాణ మండపంలో ఎంపిపి కె.దీనమయ్య అధ్యక్షతన ఏర్పాటుచేసిన మూడో విడత ఆసరా చెక్కుల పంపిణీలో ఆమె మాట్లాడారు. కురుపాం నియోజకవర్గంలో 4127 ఎస్‌హెచ్‌జిఎస్‌లో ఉన్న 47,753 మంది మహిళలకు గాను మూడో విడతగా 21.02 కోట్ల రూపాయలు అందించినట్లు తెలిపారు. మూడు విడతల్లో నియోజకవర్గంలో రూ.62.74 కోట్లు అందించినట్లు చెప్పారు. గుమ్మలక్ష్మీపురం మండలంలో 565 మహిళా సంఘాల్లోని 6472 మంది మహిళలకు రూ.2.15 కోట్లు ఆసరా పథకం ద్వారా అందిందని పేర్కొన్నారు. రాబోవు ఎన్నికల్లో మహిళలంతా జగనన్నకు వెన్నుదన్నుగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. ఆర్‌టిసి కాంప్లెక్స్ నుంచి బిఎస్ఆర్ కళింగ వైశ్య కళ్యాణ మండపం వరకు కార్యకర్తలతో భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపిలు నిమ్మక శేఖర్, ఎం.లక్ష్మణరావు, జెడ్‌పిటిసి రాధిక, రజక కార్పొరేషన్ డైరెక్టర్ గిరిబాబు, మండల సర్పంచుల సంఘం అధ్యక్షులు బి.గౌరీశంకర్రావు, నాయకులు నిమ్మక గోపాల్, ఎంపిడిఒ సాల్మన్‌రాజు, తహశీల్దార్ రాములమ్మ, డిపిఎం అప్పారావు, ఎపిఎం ఆదయ్య పాల్గొన్నారు.

**వీరఘట్టం :** పాదయాత్రలో సిఎం జగన్ ఇచ్చిన హామీలను నెరవేరుస్తున్నారని ఎమ్మెల్యే వి.కళావతి, ఎమ్మెల్సీ పి.విక్రాంత్ తెలిపారు. బుధవారం మండల కేంద్రంలో మూడో విడత అసరా చెక్కులను వారు పంపిణీ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ వీరఘట్టం మండలంతోపాటు నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాలను అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. కిమ్మి, రుషింగి గ్రామాల మధ్య నాగావళి నదిపై వంతెన నిర్మాణం, వీరఘట్టంలోనే ప్రధాన రహదారి విస్తరణ, రైతు బజార్ ఏర్పాటుకు ప్రత్యేక కృషి చేసినట్లు తెలిపారు. అనంతరం ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అనంతరం ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా 1379 సంఘాల్లో 15,279 మంది సభ్యులకు రూ.9.84 కోట్ల చెక్కును అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ పి.గౌరమ్మ, ఎంపిపి డి.వెంకటరమణ నాయుడు, జెడ్‌పిటిసి జంపు కన్నతల్లి ఉమామహేశ్వరరావు, ఎంపిడిఒ వై.వెంకటరమణ, ఎపిఎం జి.శివున్నాయుడు, ఎఎంసి ఉపాధ్యక్షులు పి.లక్ష్మణరావు, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కర్రి లీలాప్రసాదు, కో ఆప్షన్ సభ్యులు వైశ్యరాజు గోవిందరాజు, ఎంఎంఎస్ అధ్యక్షులలు పి.సుజాత, నల్లబల్లి సుహాసిని పాల్గొన్నారు.



గుమ్మలక్ష్మీపురం.. చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి

### కుర్చీల కోసం కుమ్ములాట

వీరఘట్టంలో బుధవారం నిర్వహించాల్సిన వైఎస్ఆర్ ఆసరా కార్యక్రమానికి వచ్చిన మహిళలకు సరైన వసతి సౌకర్యం లేక గంటల తరబడి నిలబడాల్సిన పరిస్థితి ఏర్పడింది. వాహనాల ద్వారా కుర్చీలు తేవడంతో మహిళలు అక్కడికి చేరుకుని వాటి కోసం కుమ్ములాట ఆడాల్సిన వచ్చింది. అయినా సగం మంది మహిళలకు మాత్రమే కుర్చీలు అందాయి. దాంతో మిగిలిన వారంతా నిల్చొని సమావేశంలో ఉపన్యాసాలు వినాల్సి వచ్చింది.






బలిజిపేట.. సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జోగారావు ; వీరఘట్టం.. చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే కళావతి, ఎమ్మెల్సీ విక్రాంత్

## ఏనుగుల సమస్యను
# ప్రభుత్వానికి నివేదించాం

- నిధుల కొరతతో ట్రాకర్లకు జీతాల చెల్లింపు ఆలస్యం
- జిల్లా అటవీ శాఖ అధికారి ప్రసూన


మాట్లాడుతున్న డిఎఫ్ఒ ప్రసూన

ప్రజాశక్తి-పాలకొండ రూరల్

జిల్లా వ్యాప్తంగా ఎదురవుతున్న ఏనుగుల సమస్యల పరిష్కారం కోసం చర్యలు తీసుకుంటున్నామని, దీనిపై ప్రభుత్వానికి కూడా నివేదిక పంపించామని జిల్లా అటవీశాఖ అధికారి ప్రసూన తెలిపారు. బుధవారం స్థానిక అటవీశాఖ కార్యాలయాన్ని సందర్శించారు. రికార్డులను పరిశీలించారు. స్థానిక అధికారులు, సిబ్బందితో సమస్యలపై సమీక్షించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ గతంలో ఉన్న ఏనుగులతో పాటు అదనంగా ఒడిశా నుండి 7 ఏనుగులు వచ్చాయన్నారు. నిరంతరం పర్యవేక్షణ చేస్తూ ప్రజలను అప్రమత్తం చేస్తున్నామన్నారు. బడ్జెట్ సమస్యతో గత కొద్ది నెలల నుండి ట్రాకర్లకు జీతాలు చెల్లించడం లేదని తెలిపారు. కార్యక్రమంలో ఎఫ్ఆర్ఒ తవిటి నాయుడు, సిబ్బంది ఉన్నారు.

## ఉపాధి పనుల పరిశీలన

ప్రజాశక్తి-పాలకొండ రూరల్

మండలంలోని తుమరాడ గ్రామంలో చేపడుతున్న ఉపాధి హామీ పనులను ఎంపిడిఒ డొంక త్రినాథులు బుధవారం పరిశీలించారు. తంపటాపల్లి గ్రామంలోని చెల్లెమ్మ కోనేరు అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ చెరువు పనులు నిబంధనలకు లోబడి చేయాలని సూచించారు.

## అంగన్వాడీ కేంద్రంలో ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి - కురుపాం

మండలంలో రస్తాకుంటుబాయి అంగన్వాడీ కేంద్రాన్ని తహశీల్దార్ ఆర్.రమేష్ కుమార్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టాక్ రిజిస్టర్ నిల్వలు పరిశీలించి వ్యత్యాసం ఉన్నట్లు తెలిపారు. అనంతరం అంగన్వాడీ సిబ్బందితో ఆయన మాట్లాడుతూ బాలింతలకు, గర్భిణులకు, పిల్లలకు అందిస్తున్న పౌష్టికాహారంలో ఎక్కడా లోపం లేకుండా చూడాలన్నారు. ఇకనుంచి సరుకుల నిల్వకు, రికార్డులకు మధ్య వ్యత్యాసం ఉంటే సహించేది లేదన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ పిఎల్వి ప్రసాద్ పాల్గొన్నారు.

## పైపులైన్ పనులు పరిశీలన

ప్రజాశక్తి-బొబ్బిలి

మున్సిపాలిటీ పరిధిలో గత కొన్నేళ్లుగా నిలిచిపోయిన రోడ్డు నిర్మాణ పనులను మున్సిపల్ ఛైర్మన్ సావు వెంకట మురళీ కృష్ణారావు బుధవారం పరిశీలించారు. బొబ్బిలి నుంచి బలిజిపేట రోడ్డు వైండింగ్ నిమిత్తం నూతనంగా వేస్తున్నటువంటి తాగునీటి పైప్‌లైన్ పనులను ఆయన పరిశీలించారు. పబ్లిక్ హెల్త్ శాఖతో పాటు కాంట్రాక్టర్‌కు త్వరగా పనులు పూర్తి చేసి మంచినీటి ఇబ్బందులు లేకుండా చూడాలని ఆదేశించారు. ఆయన వెంట మున్సిపల్ ఫిట్టర్ అప్పారావు, కాంట్రాక్టర్స్, మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.

## శాసనసభ తీర్మానాన్ని వ్యతిరేకిస్తూ నిరసన

ప్రజాశక్తి-బాడంగి

బోయ, వాల్మీకి, బెంతు, ఒరియా కులాలను ఎస్‌టి జాబితాలో చేరుస్తూ శాసనసభలో చేసిన తీర్మానాన్ని వ్యతిరేకిస్తూ ఎరుకుల సేవ సంఘం అధ్యక్షులు, రాష్ట్ర టిడిపి ఎస్‌టి జనరల్ సెక్రటరీ పాలవలస గౌరు బుధవారం నిరసన తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతంలోని గిరిజనులు ఎన్నో సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నప్పటికీ వాటిని పట్టించుకోని ప్రభుత్వం ఇతర కులాలను ఎస్‌టి జాబితాలో చేర్చేందుకు ప్రయత్నిస్తోందన్నారు. వారిని ఎస్‌టి జాబితాలో చేరుస్తూ అశాస్త్రీయ పద్ధతిలో శాసనసభలో తీర్మానం చేసి ఆదివాసులకు ప్రభుత్వం వెన్నుపోటు పొడిచిందన్నారు. తక్షణమే ఈ తీర్మానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఉద్యమం మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.



వేలం నిర్వహిస్తున్న డిఎల్‌పిఒ రామప్రసాద్

## సీతంపేట సంత వేలం

ప్రజాశక్తి-సీతంపేట

సీతంపేట సంత వేలంపాటను బుధవారం ఆ గ్రామ సచివాలయంలో డిఎల్‌పిఒ రామప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించారు వేలంపాటకు 39 మంది హాజరయ్యారు. వారపు సంత పాట 2023-24కు రూ.4.90 లక్షలకు తోయక అప్పారావు దక్కించుకున్నారు. రోజువారీ మార్కెట్‌కు హిమరక గిరి రూ.72,010కు నిలబెట్టుకున్నారు. కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి కొండపల్లి సత్యం, సర్పంచ్ ఎ.కళావతి, కార్యదర్శులు బి.సుదర్శన్‌రావు, శివ, విఆర్‌ఒ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

## కోనేరుగట్టు ఆక్రమణల పరిశీలన

ప్రజాశక్తి-బొబ్బిలి

అమ్మిగారి కోనేరు గట్టుపై అక్రమ నిర్మాణాలు ఆపాలని ఆర్‌డిఒ పి.శేషశైలజ ఆదేశించారు. కోనేరు గట్టుపై అక్రమ నిర్మాణాలను బుధవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చెరువు గట్లు, కోనేరు గట్లు, చెరువు గర్భాలలో నిర్మాణాలు చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అక్రమ నిర్మాణాలపై నిఘా పెట్టాలని తహశీల్దార్ రాజారావును కోరారు. అనంతరం చీపురు బందను పరిశీలించారు. బొబ్బిలి రెవెన్యూ డివిజన్‌లో చెరువులు, ప్రభుత్వ స్థలాలను కాపాడేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఆమెతో తహశీల్దార్ రాజారావు, ఆర్ఐ కళ్యాణ్ చక్రవర్తి, టిపిఎస్ వరప్రసాద్, తదితరులు ఉన్నారు.

## విద్యార్థులకు పతకాల పంట

ప్రజాశక్తి-పూసపాటిరేగ

విజయవాడకు చెందిన క్రీమ్ యంగ్ చిల్డ్రన్ ఆర్ట్స్ అకాడమీ తన 10వ వార్షికోత్సవం సందర్భంగా జాతీయ స్థాయి చిత్రకళా ప్రదర్శన పోటీ నిర్వహించింది. ఈ పోటీలకు పూసపాటిరేగ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు 50 మంది చిత్రాలను వేసి పంపించారు. వాటిలో 10 చిత్రాలకు బంగారుపతకాలు, 8 వెండి పతకాలకు ఎంపికయ్యాయి. వీరిలో డి.యశ్వంత్, జి.స్వాతి చంద్రరావు, శరణ్య, రిషిత, హేమశ్వంత్, మహేష్, శ్రావణిలు బంగారు పతకాలు సాధించారు. బుదవారం పాఠశాల ప్రధానోధ్యాయులు బలివాడ శంకరరావు, సిబ్బంది, పాటశాల ఛైర్మన్ శ్రీనివాసరావు చేతుల మీదుగా విద్యార్థులకు పతకాలు, ప్రశంసా పత్రాలు అందజేశారు. డ్రాయింగ్ ఉపాధ్యాయులు ఇనపకుర్తి చిన సత్యనారాయణను అభినందించారు. భవిష్యత్‌లో మరిన్ని పతకాలు సాధించాలని ఆకాంక్షించారు.

## ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

**జామి :** మండలంలోని తానవరం జంక్షన్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులకు తీవ్ర గాయాలయ్యాయి. బుధవారం ఎదురెదురుగా వస్తున్న రెండు బైకు బలంగా ఢీ కొని, తానవరం గ్రామానికి చెందిన నారాయణరావు, విశాఖ జిల్లా పద్మనాథ మండలం గందవరం గ్రామానికి చెందిన పైడిరాజు తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాదంలో ఇరువురి తలలకు గాయాలు కావడంతో అపస్మారక స్థితికి చేరుకున్నారు. జామి పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను 108 వాహనంలో ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# వైసిపి పతనం ఖాయం

### టిడిపి ఆవిర్భావ దినోత్సవంలో వక్తలు


కురుపాం.. ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి-సాలూరు

ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తూ నిరంకుశంగా ముందుకెళ్తున్న వైసిపి ప్రభుత్వ పతనం ఖాయమని టిడిపి నాయకులు హెచ్చరించారు. వచ్చే ఎన్నికల్లో అధికార పార్టీకి ప్రజలు గుణపాఠం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని వెల్లడించారు. టిడిపి 41వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా బుధవారం మండలంలోని శివరాంపురంలో ఎన్‌టిఆర్ విగ్రహానికి ఆ పార్టీ మండల అధ్యక్షుడు ఆముదాల పరమేష్ పూలమాల వేసి నివాళులర్పించారు. వైసిపి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ఎండగట్టాలని ఆయన కోరారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు కె.భాస్కరరావు, అప్పలనాయుడు, యుగంధర్, చొక్కాపు త్రినాథ్‌నాయుడు పాల్గొన్నారు.

**పార్వతీపురంరూరల్ :** టిడిపి ఆవిర్భావం తరువాతే ప్రజల్లో రాజకీయ చైతన్యం వచ్చిందని మాజీ ఎమ్మెల్సీ ద్వారపురెడ్డి జగదీష్ తెలిపారు. టిడిపి 41వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలలో భాగంగా బుధవారం పార్వతీపురం పాత బస్టాండ్ ఆవరణలో ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం పార్టీ కార్యాలయంలో కేక్ కట్‌చేసి వేడుకలు జరుపుకున్నారు. కార్యక్రమంలో టిడిపి పట్టణ, మండల అధ్యక్షులు జి.రవికుమార్, దొగ్గ మోహనరావు, మున్సిపల్ మాజీ ఛైర్‌పర్సన్ డి.శ్రీదేవి, నాయకులు జి.వెంకనాయుడు, ఉదయభాను, కోల వెంకటరావు, కౌన్సిలర్లు కోల మధు సరిత, తాతపూడి వెంకటరావు, బడే గౌరినాయుడు పాల్గొన్నారు. నరిసిపురం, తాళ్లబురిడి గ్రామాలలో టిడిపి ఆవిర్భావ వేడుకలు నిర్వహించారు. నాయకులు జి.వెంకటరమణ, బేత లక్ష్మణరావు.. ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

**సీతానగరం :** కొమ్మినేని కిశోర్ ఇంటి వద్ద మాజీ ఎమ్మెల్సీ డి.జగదీష్ ఆధ్వర్యంలో టిడిపి ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. పార్టీ జెండా ఆవిష్కరించి, ఎన్‌టిఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పార్టీ స్థాపించిన నాటి నుంచి కొనసాగుతున్న 15 మంది సీనియర్ కార్యకర్తలను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వ హయాంలో ఆరాచకాలు పెరిగాయని తెలిపారు. అలాంటి ప్రభుత్వాన్ని గద్దె దించేవరకు ప్రతికార్యకర్త పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు కె.తిరుపతిరావు, ఆర్.వేణుగోపాల్ నాయుడు, ఎస్.హరిగోపాల్, భానుప్రసాద్, సర్పంచులు జె.తెరీజమ్మ, వి.అప్పమ్మ, పి.సత్యనారాయణ, నాయకులు బి.లక్ష్మణరావు, బి.శ్రీనివాసరావు, వై.రామినాయుడు, వై.భాస్కర్‌రావు, గర్భాపు ఉదయభాను పాల్గొన్నారు.

**వీరఘట్టం :** మండల కేంద్రంలోని జామి వారి కాంప్లెక్స్ ఆవరణలో బుధవారం టిడిపి ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మండల అధ్యక్షులు ఉదయాన ఉదయ్ భాస్కర్, పట్టణ అధ్యక్షులు జామి లక్ష్మీనారాయణ కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో బి.హరిబాబు, పి.నాగేశ్వరరావు, ఎస్.శేఖరుమార్, ఎ.కుమారస్వామి, ఎల్.రాజరత్నం, ఎ.కృష్ణ, పి.మహేష్, కె.నాగభూషణరావు, జామి సింహాచలం, కె.రామకృష్ణ పాల్గొన్నారు.

**పాలకొండ :** కోటదుర్గమ్మ ఆలయం వద్ద ఎన్‌టిఆర్ విగ్రహానికి టిడిపి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టిడిపి అరకు పార్లమెంట్ ఉపాధ్యక్షులు పల్లా కొండలరావు, నాయకులు గండి రామి నాయుడు, ఆస్పత్రి కమిటీ మాజీ ఛైర్మన్ వెన్నపు శ్రీనివాసరావు, అడపా బాబ్జీ, మాజీ కౌన్సిల్ సభ్యులు అంపోలు శ్రీనివాసరావు, జవరాజు, సర్పంచ్ సిరిపురపు జగదీష్, మాజీ నీటి సంఘం అధ్యక్షులు గార దుర్గారావు, సీనియర్ నాయకులు కిమిడి కాశినాయుడు, కర్నేన యోగిత, జి.లింగమూర్తి, కోట్ల భాస్కరరావు పాల్గొన్నారు.

**కురుపాం :** స్థానిక టిడిపి కార్యాలయం వద్ద ఆ పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఆశావహులైన పువ్వల లావణ్య, బిడ్డిక పద్మావతి, తాడంగి రామారావు, భూపతిరాజు, బిడ్డిక తమ్మయ్య, ఆర్ఎస్ఎస్ విజయ్ కుమార్ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. మాజీ గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ దత్తి లక్ష్మణరావు, టిడిపి సీనియర్ నాయకులు ద్వారపు రెడ్డి సత్యనారాయణ.. జెండాను ఆవిష్కరించారు. ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు చందక రామకృష్ణ, మాజీ ఎంపిపి జి.వి.రమణమూర్తి పాల్గొన్నారు.


పార్వతీపురంరూరల్.. జెండావిష్కరణ చేస్తున్న ద్వారపురెడ్డి జగదీశ్


వీరఘట్టంలో ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో కేక్ కట్ చేస్తున్న టిడిపి నాయకులు

**బలిజిపేట :** స్థానిక బస్టాండ్ సమీపంలో ఉన్న ఎన్‌టిఆర్ విగ్రహం వద్ద టిడిపి మండల అధ్యక్షులు పెంకి వేణుగోపాలనాయుడు ఆధ్వర్యాన కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో నాయకులు సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

**జియ్యమ్మవలస :** రానున్న ఎన్నికల్లో కార్యకర్తలు, నాయకులు సైనికుల్లా పనిచేసి పార్టీ విజయానికి కృషి చేయాలని మాజీమంత్రి, టిడిపి సీనియర్ నాయకులు శత్రుచర్ల విజయరామరాజు కోరారు. బుధవారం చినమేరంగిలో శత్రుచర్ల నివాసంలో టిడిపి 41వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా జరిగాయి. శత్రుచర్ల పార్టీ జెండా ఆవిష్కరించారు. ఎన్‌టిఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్టీ ఆవిర్భావం నుండి కొనసాగుతున్న పల్ల రాంబాబు, పూర్ణచంద్రరావును సత్కరించారు. కార్యక్రమంలో అరకు పార్లమెంట్ అధికార ప్రతినిధి డొంకాడ రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

**సీతంపేట :** స్థానిక టిడిపి కార్యాలయంలో పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను నిర్వహించారు. టిడిపి మండల అధ్యక్షులు సవరతోట మొఖలింగం, మాజీ జెడ్‌పిటిసి పాలక రాజబాబు, మాజీ సర్పంచ్ బి.దమయంతి నాయుడు, ఐటిడిపి యూత్ కన్వీనర్ బిడ్డిక సోను పాల్గొన్నారు.

# మన్యం బంద్‌ను జయప్రదం చేయండి


గుమ్మలక్ష్మీపురం.. మన్యం బంద్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న గిరిజన సంఘం నాయకులు

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

ఈ నెల 31న చేపట్టబోయే మన్యం బంద్‌ను విజయవంతం చేయాలని ఎపి గిరిజన సంఘం జిల్లా గౌరవాధ్యక్షులు, చెముడుగూడ ఎంపిటిసి మండంగి రమణ కోరారు. బంద్‌కు వర్తక సంఘం, మోటారు యూనియన్, రిక్షా కళాసీ యూనియన్ మద్దతు తెలిపి జయప్రదం చేయాలని కోరుతూ గుమ్మలక్ష్మీపురంలోని గిరిజన సంఘం కార్యాలయంలో బుధవారం వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బోయ, వాల్మీకులను ఎస్‌టి జాబితాలో చేర్చితే గిరిజన హక్కులు, చట్టాలు పూర్తిగా హరించబడతాయని ఆందోళన వ్యక్తంచేశారు. బిసిలో ఉన్న అభివృద్ధి చెందిన బోయ, వాల్మీకులను ఎస్‌టి జాబితాలో చేర్చుతామని అసెంబ్లీలో ముఖ్యమంత్రి చేసిన ప్రకటన వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. గిరిజనులకు ఉన్న రిజర్వేషన్లు కూడా ఒక్కొక్కటి తొలగిస్తూ గిరిజనుల పట్ల ప్రభుత్వం వివక్షత చూపుతోందన్నారు. కార్యక్రమంలో దుమ్మంగి సర్పంచ్ పాలక క్రాంతికుమార్, ఇరిడి ఎంపిటిసి కడ్రక మల్లేశ్వరరావు, గిరిజన సంఘం నాయకులు బిడ్డిక శంకర్రావు, పువ్వల మోహన్ రావు, సన్యాసిరావు పాల్గొన్నారు.

**కురుపాం :** బోయ, వాల్మీకులను ఎస్‌టి జాబితాలో చేర్చొద్దంటూ ఈ నెల 31న చేపట్టే మన్యం బంద్‌ను విజయవంతం చేయాలని గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి ఎం.శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బోయ, వాల్మీకులను ఎస్‌టిలో చేర్చడమంటే గిరిజనుల హక్కులు కాలరాయడమేనని అభిప్రాయపడ్డారు. ఇప్పటికే గిరిజన యువత ఎంతోమంది చదువుకొని ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. అలాంటిది ఇప్పుడు బోయ వాల్మీకులను ఎస్‌టిలో చేర్చాలని అసెంబ్లీలో తీర్మానించడం సమంజసం కాదన్నారు.

**సాలూరురూరల్ :** ఈ నెల 31న జరిగే మన్యం బంద్‌ను విజయవంతం చేయాలని గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు సీదరపు అప్పారావు కోరారు. గిరిజన సంఘం ఆధ్వర్యంలో సాలూరు మండలం మామిడిపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గిరిజనులకు నష్టం చేసే విధంగా బోయ, వాల్మీకులను ఎస్‌టిలో కలపాలని ప్రభుత్వం చేసిన తీర్మానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. దీన్ని గిరిజనుల ఓట్లతో గెలుపొందిన ప్రజాప్రతినిధులు వ్యతిరేకించక పోవడం దారుణమన్నారు. గిరిజనుల పక్షపాతినని చెప్పుకొనే ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర వెంటనే ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో గిరిజన సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు గెమ్మెల జానకిరావు, వంతల సుందరరావు తదితరులు పాల్గొన్నారు.

## 'చలో ఢిల్లీ'ని విజయవంతం చేయాలి

ప్రజాశక్తి-పాలకొండ రూరల్

ఏప్రిల్ ఐదో తేదిన చేపట్టే చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆటో యూనియన్ నాయకులు కాద రాము కోరారు. బుధవారం పట్టణంలో కరపత్రాలతో ప్రచారం చేపట్టారు. ఆటో కార్మికులకు కేరళ తరహా సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, పెరిగిన పెట్రోల్, డీజిల్ ధరలు, ఇన్సూరెన్స్ తగ్గించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పి.రాము, జి.శివ, బి.రామకృష్ణ, సింహాచలం, తదితరులు పాల్గొన్నారు.

## గ్రంథాలయంలో అదనపు సౌకర్యాలు

ప్రజాశక్తి-పార్వతీపురంటౌన్

బెలగాంలోని మున్సిపల్ గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన అదనపు సదుపాయాలను బుధవారం ఎమ్మెల్యే అలజంగి జోగారావు ప్రారంభించారు. అనంతరం గ్రంథాలయ ప్రాంగణంలో మొక్కలను నాటారు. అదనపు కుర్చీలు, బెంచీలతోపాటు పోటీ పరీక్షలు పుస్తకాలను, నవలలను మున్సిపల్ నిధులతో సమకూర్చారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ బి.గౌరీశ్వరి, వైస్ ఛైర్మన్ ఇండుపూరు గున్నేశ్వరరావు, వైసిపి పట్టణ అధ్యక్షులు కొండపల్లి బాలకృష్ణ, మున్సిపల్ కమిషనర్ రామ అప్పలనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

# పారిశుధ్య నిర్వహణకు వాలంటీర్ల సహాయం

### డిపిఒ సత్యనారాయణ



మాట్లాడుతున్న డిపిఒ సత్యనారాయణ

ప్రజాశక్తి-సీతానగరం

గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణకు వాలంటీర్ల సాయం తీసుకోవాలని డిపిఒ బి.సత్యనారాయణ సూచించారు. మండలంలోని పెదబోగిలి ఎస్‌డబ్ల్యుపిసిలో ఏర్పాటుచేసిన స్వచ్ఛ సంకల్పం శిక్షణను బుధవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలలో పారిశుధ్యం పట్ల అవగాహన కల్పించి, ఇంటి నుంచి చెత్త సేకరించేటప్పుడే తడి, పొడి చెత్త వేరు అందించేలా చేయాలని సూచించారు. తడి చెత్త నుండి వర్మీ కంపోస్టు తయారు చేయాలన్నారు. పొడి చెత్తను వేరు చేసి మండలానికి మంజూరైన ష్రెడ్డర్ వినియోగించి ముక్కలుగా చేసి విక్రయించడం ద్వారా ఆదాయాన్ని సమకూర్చుకోవాలని కోరారు. అనంతరం గరుగుబిల్లి ఇఒపిఆర్‌డి గోపాలరావు మాట్లాడుతూ మార్పు అనేది నెమ్మదిగా వస్తుందని, దానికి సచివాలయ సిబ్బంది కృషి చేయడం ద్వారా స్వచ్ఛమైన గ్రామాలను రూపొందించుకోవచ్చని చెప్పారు. కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి వర్మ, సర్పంచ్ తెరీజమ్మ, పెదబోగిలి ఇఒ వెంకట్రావు, జూనియర్ సహాయకులు రమేష్, కార్యదర్శి శ్రీనివాసరావు పాల్గొన్నారు.


సర్వే రాళ్లను పరిశీలిస్తున్న కలెక్టర్, జెసి

# హద్దులు పక్కాగా ఉండాల్సిందే


### రీసర్వే సిబ్బందికి కలెక్టర్ ఆదేశం

ప్రజాశక్తి-పాలకొండ రూరల్


రీ సర్వే అనంతరం హద్దులు పక్కాగా ఉండాలని జిల్లా కలెక్టర్ నిశాంత్‌కుమార్.. సర్వే సిబ్బందిని ఆదేశించారు. పాలకొండ మండలం తుమరాడ గ్రామంలో భూముల రీసర్వే పనులు, సర్వే రాళ్లు పెట్టడం తదితర అంశాలను జాయింట్ కలెక్టర్ ఒ.ఆనంద్‌తో కలిసి జిల్లా కలెక్టర్ బుధవారం పరిశీలించారు. రీసర్వే పూర్తయిన గ్రామాల్లో సర్వే రాళ్ల వెంటనే ఏర్పాటు చేయాలని ఆయన సూచించారు. కోఆర్డినేట్స్ పక్కాగా నిర్ణయించి రైతుల భాగస్వామ్యంతో రాళ్లను పెట్టుటకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో సబ్ కలెక్టర్ నూరుల్ కమర్, తహశీల్దార్ పి. సోమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

### ఘనంగా పాఠశాల వార్షికోత్సవం

**సాలూరు :** పట్టణంలోని బంగారమ్మపేట మున్సిపల్ ప్రాథమికోన్నత పాఠశాల వార్షికోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో బాలికలు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. పాఠశాల హెచ్ఎం డాక్టర్ రంభ రజనీకాంత్ ఆధ్వర్యాన నిర్వహించిన కార్యక్రమంలో పేరెంట్స్ కమిటీ ఛైర్‌పర్సన్ నల్ల వీరమణి, వైస్ ఛైర్మన్ మధు పాల్గొన్నారు.



నృత్యం చేస్తున్న విద్యార్థినులు



మాట్లాడుతున్న ట్రస్టు వ్యవస్థాపకులు డి.పారినాయుడు

## పదో తరగతి విద్యార్థులకు ఘన వీడ్కోలు

ప్రజాశక్తి-జియమ్మవలస

మండలంలోని పెదమేరంగి జంక్షన్లో ఉన్న శ్రీసత్య కైలాస్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు బుధవారం ఘన వీడ్కోలు పలికారు. జట్టు ట్రస్ట్ వ్యవస్థాపకులు డాక్టర్ డి.పారినాయుడు మాట్లాడుతూ 20 ఏళ్లుగా విద్యార్థులకు క్రమశిక్షణ, సామాజిక స్పృహతో నాణ్యమైన విద్యను అందిస్తున్నట్లు చెప్పారు. అనంతరం పాఠశాల కరస్పాండెంట్ రౌతు అజయ్ కుమార్, అఖిల ప్రజా కళాకారుల సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి రౌతు వాసుదేవరావు మాట్లాడుతూ విద్యార్థులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి.రాజశేఖర్, జి.హరికృష్ణ, తదతరులు పాల్గొన్నారు.

# పాఠశాలకు మంచిపేరు తేవాలి

ప్రజాశక్తి-పాలకొండ

విద్యార్థులు బాగా చదువుకొని చదివిన పాఠశాలకు, సొంత ఊరికి పేరు తీసుకురావాలని ఎంఇఒ మీసాల సూర్యనారాయణ కోరారు. వెంకంపేట వీధి ప్రాథమికోన్నత పాఠశాలలో బుధవారం ఫేర్‌వెల్ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఎక్కడ స్థిరపడినా చదివిన పాఠశాలను మరువరాదన్నారు. అంతకు ముందు విద్యార్థులు డ్యాన్స్‌లతో అదరగొట్టారు. 8వ తరగతి విద్యార్థులకు వీడ్కోలు సందర్భంగా వారికి బహుమతులు అందించారు. ఈ సందర్భంగా ఎంఇఒను ఉపాధ్యాయులు, పేరెంట్స్ కమిటీ సభ్యులు సత్కరించారు. ప్రధానోపాధ్యాయుడు జి.పరాంకుశం నాయుడు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఉపాధ్యాయులు కె.నాగేశ్వరరావు, జి.సూర్యనారాయణ), ఎస్.వాసు దేవరావు, పి.హేమినికుమార్, తదితరులు పాల్గొన్నారు.